


# స్త్రీ హృదయం

*ఫిబ్రవరి 15, 1968*
*జగపతినగరం*

వసంతకు,

రఘుపతిరావు ఆశీర్వదించి వ్రాయునది. ఉభయ కుశలోపరి. "ఇంత చొరవతో వ్రాస్తున్నాడేమిటితను" అని భావించకు. గత్యంతరం లేదు. ధైర్యం చేయవలసిన సమయమిదే. మీ వాళ్ళు, మా వాళ్ళు మన వివాహం ఖాయం చేసారని నీకు తెలిసిన విషయమే. నాకు కొద్దిగా భయంగా వుంది. కారణం– ప్రతి స్త్రీ రూపవంతుడు, గుణవంతుడు, ధనవంతుడు తన భర్తగా కావాలని కోరుకుంటుంది. అది సహజం. అంటే.... పురుషుడు కూడా ఆలా కోరుకోడని కాదు. ఇది అనాదిగా యిరువురిలో నున్న విషయమే, అలవాటే. నేను నీ ఫొటో చూశాను. అది చూసిన తర్వాత నేనో నిశ్చయానికి వచ్చాను. నేను నిన్ను చేపట్టడానికి అర్హుడను కాదనిపిస్తోంది. నా ఫొటో కూడ నీకు పంపించాను కదా! నేనెంత సామాన్యమైన వాడినో తెలుసుకొనే వుంటావు. చూసిన తరువాత కూడా నువ్వీ వివాహానికి సమ్మతించడం– నాకో అనుమానాన్ని కలిగిస్తున్నది. బహుశా మీవాళ్ళ ఒత్తిడివల్ల వప్పుకున్నావనుకుంటా. నేనూహించినదే నిజమయితే... నీ జీవితం నీ చేతులారా నాశనం చేసుకొన్నట్లే అవుతుంది. పైగా నా జీవితం కూడా. ఎందుచేతనంటే.. అందవిహీనుణ్ని నీవు ప్రేవించలేవు, ఆదరించలేవు. ప్రేమించలేక... మనసులో ఏహ్యాభావంతో వుండవచ్చు. అప్పుడు మన యిరువురి జీవితాలు నరకంలో నాట్యం చేస్తాయి. ఇదంతా నా ఊహ మాత్రమే. దేనికైనా ముందు వెనుకలు, మంచి

చెడ్డలు యోచించాలి కదా! కాబట్టి నీవు కూడా అన్ని కోణాల నుంచి బాగా ఆలోచించి చూడు. తరువాత ఓ నిర్ణయానికి రా. నే తలచినట్లు... మీ తల్లిదండ్రుల మాటను జవదాటలేక, శిరసావహించి ఈ వివాహానికి సమ్మతించినట్లయితే, తరువాత చింతించి ప్రయోజనం లేదు. నీ నిర్ణయం సరిగ్గా నాకు వ్రాయి. మనకు ముఖ పరిచయం అంతగా లేదు. ఫొటోలు చూడడం తప్పించి. అందుచేత సిగ్గూ, జంకూ కూడా అనవసరం. ఇది రెండు జీవితాలతో ముడిపడిన అతి ముఖ్యవిషయం. నీకు నచ్చని పక్షాన నాకు తెలియపరిస్తే... నాకీ పెళ్లి యిష్టం లేదని మావాళ్ళతో చెప్పి ఆపు జేయిస్తాను. నే నెవరినీ ఇంతవరకు ప్రేమించలేదు. యిప్పటికే చాలా వ్రాశాను. జాబు చదివి, నాపై సానుభూతితో సమ్మతించక.......

నీ ఉత్తరానికై ఎదురుచూస్తూ....

రఘుపతిరావు

*ఫిబ్రవరి 20, 1968*

*గజపతినగరం*

ప్రేమపూర్వక నమస్కృతులతో తమ వసంత వ్రాయునది. ఈ సంబోధనకు ఆశ్చర్యపోతున్నారు కదూ? మీ ఉత్తరం చదివాను. మీ ఫొటో చూసినప్పుడే.... సిగ్గు వేస్తుందండీ వ్రాయడానికి. ప్రతి యువతీ అందగాడినే ప్రేమిస్తుందా? అయినా మీరంద విహీనులు కాదే. ఎంత బాగా వూహించారండి! చిన్నతనం నుంచీ నాకు, నా మాటకు ఎదురు లేదు. నా యిష్టానికి వ్యతిరేకంగా ఎవరూ నన్ను బలవంతం పెట్టరు. మొదట నన్నడిగి, నా కిష్టమని తెలుసుకొనే మన వివాహం నిశ్చయించారు. నాకు కావలసిన మంచి హృదయం, అమాయకత్వం మీ ప్రేమ పూరిత నయనాల్లోనే చూశాను. యిటువంటి కాంతివంతమైన మీ కళ్ళంటే నాకెంతో యిష్టం. ఇకపోతే సుఖమనేది "ఇందు"లో వుందని ఎవరు చెప్పగలరు. నే నెంత యోచించినా నా నిర్ణయం తప్పుకాదని నా మనస్సు గట్టిగా చెబుతున్నది. ఇంతిలా వ్రాసినందుకు మన్నించమని ప్రార్థన. మీరు వ్రాసిన దానికి విపులీకరించి వ్రాయవలసి వచ్చింది. ఎల్లవేళలా మిమ్ములనే తలుస్తూ... మీ జాబుకై వేయి కళ్ళతో ఎదురుచూస్తూ...

మీ

ప్రియతమ

వసంత

ఫిబ్రవరి 25, 1968
జగపతినగరం

ప్రియాతిప్రియమైన వసంతా–

నీ జాబు అందినది. నిన్నిలా సంభోదిస్తూ నా జీవితంలో నీకు లేఖ వ్రాయగలనని కలలో కూడ తలంచలేదు. నీ జాబు ఎన్నిసార్లు చదివినా... మరల మరల చదవాలనే అనిపిస్తోంది. ఇది కలా– నిజమా అని నేనాశ్చర్యపోయాను. ఎంతసేపటికీ నమ్మకం కలుగలేదు. నా అదృష్టానికి మురిసిపోయాను. 'ఒరే నాయనా నీ అందానికి నీ కోసం ఏ తల్లి ఎక్కడ పూజ చేస్తున్నదోరా?' అని మా అమ్మ నన్ను వేళాకోళం చేసేది అప్పుడప్పుడు. నేను ఏడ్పు ముఖం పెట్టేవాడిని. యిప్పటివరకూ నేనందవిహీనుడను కాదన్నవారు లేరు. నీవామాటను వమ్ము చేశావు. నీదింత విశాలహృదయమా? లేకపోతే ఏమిటిది? నా కిప్పటికీ నమ్మకం కలగటం లేదు. అవును మరి! ఎలాకలుగుతుంది చెప్పు. ఏ వ్యక్తికయినా అనుమానం రాకతప్పదు. భ్రమరం సువాసనలు వెదజల్లు గులాబీని కాదని... ఎందుకూ పనికిరాని గడ్డి పూవుకోసం అర్రులు చాస్తుందని చెబితే.... నమ్మే నాధులున్నారా? ఆ విధంగానే నేను మొదట నమ్మలేకపోయాను. తరువాత ఆలోచించగా... ఇది నా పూర్వజన్మ సుకృతమే అయ్యుండొచ్చు అనుకున్నాను. ఈ భావంతో జీవితపర్యంతం నాతో వుండగలదా? నన్ను ప్రేమించగలదా? యిటువంటి సందేహాలు నన్ను పీక్కుతింటున్నాయి. నీ లెటరు చదివిన నాటి నుంచి నా మనస్సు ఆనందసాగరంలో పొంగిపొర్లుతోంది. నా స్మృతి పథంలో నీ రూపమే కదులుతోంది. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. శ్రద్ధగా చదువుతున్నాను. నిన్ను మరోమారు యోచించమని చెబుతూ, నీ ఆశల జాబుకై వేయికళ్ళతో ఎదురుచూస్తూ......

అదృష్టజాతకుడు
నీ
రఘుపతిరావు

మార్చి 3, 1968
గజపతినగరం

ప్రియమైన బావగార్కి–

తమ వసంత హృదయపూర్వక నమస్కృతులతో వ్రాయునది. మీ జాబు నిన్ననే అందినది. సంగతులు విశదము. మీరెటువంటి సందేహాలూ పెట్టుకోక, శ్రద్ధగా చదువుకోండి. మీరు పరీక్షలు బాగా వ్రాసి, మంచి మార్కులతో పాసుకావడమే నాకు

కావలసింది. ఏవేవో వ్రాద్దామనుకున్నాను. భాష చాలడం లేదు. మీ జాబు కోసం నిరీక్షిస్తూ.....

మీ
ప్రియతమ
వసంత

*ఏప్రిల్ 1, 1968*
*జగపతినగరం*

ప్రియతమ వసంతకు-

నీ రఘుపతిరావు ఆశీర్వదించి వ్రాయునది. పరీక్షల తొందరలో నీకు జాబు ఇంతవరకూ వ్రాయలేకపోయాను. అందుకు చింతిస్తున్నాను. పరీక్షలు మాత్రం చాలా బాగా వ్రాశాను. ఫస్టుక్లాసు రావచ్చు. యింక కొద్దిరొజులు నిరీక్షిస్తే... అబ్బ! ఏవేవో తీయటి ఊహలు మనసులో మెదులుతున్నాయి. సభ్యతగా వుండవని వ్రాయడం లేదు అవన్నీ. పోనీ యింకోలా వ్రాయుటకు నేను కవిని కాదాయె. నీ జాబు కోసం ఎదురు చూస్తూ, మరికవుంటాను.

నీ
రఘుపతిరావు

కొద్ది క్షణాలు క్రితమే సూర్య భగవానుడు విశ్రాంతి కోసం పడమటి కొండల్లోకి వెళ్ళిపోయాడు. ఇప్పుడిప్పుడే చీకటి తెరలు ఆకాశాన్ని అలముకుంటున్నాయి. అప్పుడే ఓ చిన్న పెంకుటింటిలో ఎలక్ట్రిక్ లైట్ వెలిగింది. కిటికీ ఊసలగుండా దాని కాంతి పెరటిలోని పూల మొక్కలపై పడుతోంది.

“వసూ” అంటూ రఘుపతిరావు త్వరత్వరగా ఇంట్లోకి వచ్చాడు ఆఫీసు నుంచి. కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుతున్నదల్లా లేచి నుంచొంది వసంత. “ఏం పుస్తకం చదువుతున్నావ్” అని అడిగాడు ఆమెను. “హాయి హాయి ఈ రేయి” అంది నవ్వుతూ. “దీన్ని చదువుతుండండి కాఫీ తీసుకువస్తాను” అంటూ వంట గదిలోకి వెళ్ళింది. పుస్తకం తీసుకొని కుర్చీవద్దకు వెళుతున్న రఘుపతిరావు దృష్టి డ్రాయరుపై పడింది. పేపరు వెయిట్ క్రిందున్న లెటర్ ఫేన్ గాలికి రెపరెపలాడుతోంది. తనదేమోనని చేతిలోకి తీసుకొన్నాడు ఆ లెటర్. తీరా సంబోధన చూస్తే, వసంత పేర వుంది. అతని సంస్కారం చదువకూడదన్నా, మనస్సు మాత్రం ఏం వుందో చదువు అని ఒత్తిడి చేసింది. యాంత్రికంగా ఆ జాబు త్వరితగతినిలా చదువుకున్నాడు.

విజయనగరం

జూన్ *26, 1968*

డియర్ వసంతా–

యు ఆర్ వెరీ పూర్ గరల్. నీవు అందగత్తెవి. నీలో అందం వుందిగాని, తెలివితేటలు లేవు. నిన్ను "లవ్" చేస్తున్నాను– నన్ను "మారేజ్" చేసుకుని సుఖపడమని నీ కెన్నిసార్లు చెప్పేను. విన్నావా? నా మాటలు పెడచెవిన పెట్టేవు. ఇదుగో... ఇప్పుడనుభవిస్తున్నావ్. నాలాటి అందగాణ్ని కాదని... ఎవడో కురూపిని కట్టుకున్నావ్. నీ జీవితం నరకమయం చేసుకున్నావు. అందరికీ అదృష్టం వుండొద్దూ! నీ కంటే అంతగత్తె సరోజ అనుభవిస్తోంది స్వర్గసుఖాలు నాతో. ఎప్పుడైనా క్లబ్‌కెళ్ళావా అతనితో? క్లబ్‌లు... సినిమాలు, షికార్లు... ఓహ్ ఒకటేమిటి! ఇవన్నీ అనుభవిస్తోంది సరోజ. దేనికైనా పెట్టి పుట్టాలి. బహుశా ఇప్పుడనుకుంటావ్... అయ్యో ఎంతపని చేశాను. అప్పుడే అతన్ని చేసుకుని వుంటే ఇప్పుడవన్నీ అనుభవించేదానిని కదా! నేనెంత దురదృష్టవంతురాలిని అని వినలేని బాధతో విలపిస్తుంటావ్. నీవలా విచారించటం నాకసలు నచ్చదు. అందుకే సానుభూతితో నిన్నా నరకం నుంచి విముక్తి కలిగిద్దామనుకుంటున్నాను. యిప్పుడైనా మించిపోయింది లేదు. నువ్వు "ఊ" అంటే చాలు. సరోజకు డైవర్స్ యిచ్చి, నిన్ను మారేజ్ చేసుకుంటాను. ఏమంటావ్? బావుంది కదూ నా ఐడియా! త్వరలో సంతోషంగా లెటర్ వ్రాయి. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ..

కాబోయే

నీ

వాసు

ఉత్తరం ముగించిన రఘుపతిరావు దాన్ని పేపర్ వెయిట్‌క్రింద పెట్టబోయాడు. ఇంతలో దానిక్రింద ఇంకో కవరు కన్పించింది. దాన్నికూడా ఆత్రుతతో ఇలా చదువుకోసాగాడు.

హైదరాబాద్

ఆగస్టు *23, 1968*

వాసుదేవగావు గారికి,

వసంత వ్రాయునది. మీరు వ్రాసిన దానికి, ఊహించిన దానికి భిన్నంగానే వున్నాను. మీలా ఆయన చపలచిత్తమైన మనస్సు కలవారు కాదు. యిక ముందెప్పుడూ ఇటువంటి పిచ్చి వూహలు మనస్సులోకి రానీయవద్దు. పాపం సరోజకు అన్యాయం చేయొద్దు. నేనిక్కడ

ఎంతో ఆనందంగా జీవిస్తున్నాను. సుఖించటానికి క్లబ్‌లు, బీచ్‌లు, సినిమాలు కావు కావలసింది– హృదయమున్న మనిషి. కట్టుకున్న భర్తను విడిచిపెట్టి, మీ వద్దకు నేనెలా వస్తాననుకున్నారు? నన్నంత నీచంగా భావించినందుకు చింతిస్తున్నాను. నా యందు దయవుంచి, యింకెప్పుడూ ఉత్తరాలు వ్రాయవద్దు గ్రహించండి.

ఇట్లు
వసంత

చదివిన ఉత్తరం కవరులోపెట్టి, పేపర్ వైట్ క్రింద వుంచి సోఫాలో కూర్చున్నాడు. ఈ లెటరింకా పోస్టు చేయలేదని గ్రహించాడు. ఆశ్చర్యంతో నొసలు ముడివేస్తూ కూర్చున్నాడు. "ఇదుగో కాఫీ" అని ఓ కప్పు అతనికిస్తూ.. మరో కప్పు తాను తీసుకుంది వసంత. కాఫీ పుచ్చుకుంటూ "సినిమా కెళ్దామా" అన్నాడు రఘుపతిరావు. తాగిన కాఫీ కప్పులు ఓ మూలపెట్టి, "ఎందుకండీ సినిమాకు? హాయిగా మాట్లాడుకోటానికి కుదరదు. సుఖంగా దగ్గరగా కూర్చుండడం కుదరదు. ఎప్పుడూ ఇలానే వుంటే ఎంత హాయి! ఏమంటారూ?" అంటూ ప్రేమగా అతని భుజాలపై చేతులువేస్తూ.. అతని ఒడిలో తల పెట్టుకొని, ప్రేమపూరిత ద్రుక్కులతో అతన్ని చూసింది.

వసంత హృదయపు లోతును కనుగొనాలని ఆమె కళ్ళలోకి రెండు నిమిషాలు చూసి, "విచిత్ర హృదయం స్త్రీ హృదయం. దాని లోతుపాతులను కనుగొనాలనుకోవటం సముద్రపు లోతును తెలుసుకోటానికి ప్రయత్నించటమే అవుతుంద"నుకొని మనస్సులో, వసంతను ప్రేమతో తన బాహువుల్లో బంధించాడు రఘుపతిరావు.

చందమామ సిగ్గుతో మేఘాలలోకి పోయి దాక్కున్నాడు.

*మే 1968, సుహాసిని మాసపత్రిక*

*(ఇది నా మొదటి కథ. 17–18 ఏళ్ళ వయసులో కె.వి.సుబ్రహ్మణ్యవర్మ పేరుతో రాశాను. విశ్వప్రసాద్ సంపాదకత్వంలో వెలువడిన సుహాసిని మాసపత్రికలో ఈ కథ వచ్చింది.)*